క్లుప్తంగా

గ్రామదేవతల ఆశీస్సులు పొందాలి



తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన బొడ్రాయి ఉత్సవాలు, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో చివరి రోజు మంగళవారం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామాలకు రక్షణగా ఉండే గ్రామదేవతలను పూజిస్తేనే ఆ దేవతల ఆశీర్వాదాలతో గ్రామాలు పచ్చని పంటపొలాలతో కళకళలాడుతాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఐక్యతకు ఈ ఉత్సవాలు ఎంతో నిదర్శనమన్నారు. సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా భోజనశాల నిర్మాణ పనులు



తాడూరు: మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం నిర్మించే భోజనశాల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాధవరెడ్డి మాట్లాడారు. 'మన ఊరు– మన బడి' పథకంలో భాగంగా పాఠశాల ఆవరణలో భోజనశాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు.

ధరణి ఆపరేటర్ జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు



కోడేరు: ధరణి ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించేందుకు నాగర్‌కర్నూల్ జిల్లా ధరణి ఆపరేటర్లు, కోఆర్డినేటర్ల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు, ఉపాధ్యక్షుడిగా కళ్యాణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. జిల్లాలో ధరణి ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత, గౌరవ వేతనం ప్రతినెలా చెల్లించాలని కోరారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు



చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో మంగళవారం సర్పంచ్ మహేష్ రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. గ్రామంలో ప్రతి వీధిని సీసీగా మార్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. తిరుమలేష్, కమలాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సేవలను ప్రశంసిస్తూ.. సన్మానం



మన్ననూర్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఈసీ మెంబర్‌గా కొనసాగుతున్న మన్ననూర్‌కు చెందిన సంబు వెంకటరమణ కొంత కాలంగా కుల మతాలకు అతీతంగా స్వచ్ఛందంగా అనేక సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్యుల కోసం శ్రీశైలం పుణ్యక్షేత్రం వద్ద నిర్మించిన సత్రంలో ఒక గదికి అయ్యే ఖర్చును ఆయనే భరించారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న సత్రం ప్రారంభోత్సవ సంబరాల్లో భాగంగా వెంకటరమణ దంపతులను శాలువా పూల మాలలతో పాటూ జ్ఞాపికను సత్రం నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా మిడిదొడ్డి శ్యామ్ సుందర్ చేతుల మీదుగా అందజేసి సన్మానించారు. రామకృష్ణ, శ్రీధర్, శ్రీనివాస్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా లక్ష్మణ్ ఎన్నిక

పెంట్లవెల్లి: బీఎస్పీ మండల అధ్యక్షుడిగా మల్లేశ్వరానికి చెందిన బంకల లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడని జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య అన్నారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షత బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు నిత్యం అండగా ఉంటానని, పార్టీకి నిరంతరం కృషి చేస్తానని బహుజన రాజ్యాధికారం కోసమే ముందుకు సాగుతానని తెలియజేశారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- దుందుభీ వాగు నుంచి నిరంతరాయంగా రవాణా
- చోద్యం చూస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు



కల్వకుర్తిలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

కల్వకుర్తి రూరల్: దుందుభీ వాగు నుంచి యథేచ్ఛగా ఇసుక దోపిడీ కొనసాగుతుంది. ప్రభుత్వం ఇసుక అనుమతులు తీసుకునే ఏర్పాట్లు చేసినప్పటికీ అది మూడున్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది.

జోరుగా రవాణా..

కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని వంగూరు, కల్వకుర్తి మండలాల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. వరుసగా 4 సంవత్సరాలు వర్షాలు కురవడంతో పాటు కృష్ణా నీటిని దుందుభీ నదిలోకి వదలడంతో దుందుభీ వాగులో ఇసుక మేటలు వేశాయి. ఇది ఇసుక అక్రమ రవాణాదారులకు వరంగా మారింది. కల్వకుర్తి పట్టణంతో పాటు మండలంలో ఆయా గ్రామాల్లో గృహరంగ నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీంతో దుందుభీ వాగు నుంచి ఇసుకను దోచేస్తున్నారు.

పగలు దంపు, రాత్రి లిఫ్టింగ్

మండలంలోని రఘుపతిపేట, ఎల్లికట్ల, సుద్దకల్, వంగూరు మండలంలోని పొల్కన్‌పల్లి, సదగోడు, ఉల్పర తదితర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. పదుల సంఖ్యల ట్రాక్టర్లతో ఉదయం వేళ వాగు పరిసర పంట పొలాల్లో ఇసుకను డంపు చేస్తున్నారు. రాత్రి అయిందంటే ఆ డంపును తరలించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని రఘుపతిపేట, సుద్దకల్ వాగు పరిసరాల నుంచి అచ్చంపేట, బల్మూరు, లింగాల, తాడూరు, నాగర్‌కర్నూల్, మాదారం, మిడ్జిల్ తదితర ప్రాంతాలకు తరలి వెళ్తుండగా.. సుద్దకల్‌లో టిప్పర్ల ద్వారా రంగారెడ్డి జిల్లాకు తరలిస్తున్నారు.

రోజుకు వంద ట్రాక్టర్లు

దుందుభీ పరిసర వాగుల నుంచి ప్రతి నిత్యం వంద ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. రాత్రి 12 గంటల నుంచి వేకువజామున 5 గంటల వరకు వరుసపెట్టి ఇసుక ట్రాక్టర్లు అక్రమ రవాణాను కొనసాగిస్తున్నాయి.

పట్టించుకోని పోలీస్, రెవెన్యూ శాఖలు

ఇసుక అక్రమ రవాణా విషయంలో రెవెన్యూ, పోలీస్ శాఖలు చూసీ చూడనట్లు వదిలేస్తుండటంతో రవాణాకు అడ్డుకట్ట పడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ రవాణా విషయంపై ఆర్డీఓ రాజేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఇసుకను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.



రఘుపతిపేట సమీపంలో ఇసుక డంపు (ఫైల్)



అక్రమ రవాణాతో ఏర్పడిన గుంత(ఫైల్)

ప్రగతి నివేదన సభకు తరలిన నాయకులు



వెల్దండ నుంచి తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



అచ్చంపేట మండలం బొమ్మన్‌పల్లి నుంచి బయలు దేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రగతి నివేదన సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివెళ్లారు. ఆయా గ్రామాల్లో ప్రైవేట్ బస్సులు, వ్యాన్‌లు, ఆటోలు, క్రూజర్ల ద్వారా ప్రజలను తరలించారు. మండంలోని అన్ని గ్రామాల నుంచి దాదాపుగా 30 వేల మందికి పైగా ప్రగతి నివేదన సభకు తరలివెళ్లారు.

కల్వకుర్తి నుంచి..

జిల్లా కేంద్రంలో సీఎం సభకు కల్వకుర్తి మండలంలోని మార్చాల, ఎల్లికల్, తర్నికల్, యంగంపల్లి, జిల్లెల్ల తదితర గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, మహిళలు ఆయా గ్రామాల సర్పంచ్‌లు పెద్దఎత్తున వివిధ వాహనాల్లో తరలించారు.

అచ్చంపేట నుంచి

నల్లమల ప్రాంతం నుంచి సీఎం కేసీఆర్ సభకు మంగళవారం ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో భారీగా నాయకులు తరలివెళ్లారు.

కల్వకుర్తి నుంచి..

జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ కలెక్టరేట్ సమీకృత కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, పార్టీ కార్యాలయం ప్రారంభం అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు కల్వకుర్తి నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీగా తరలి వెళ్లారు.

– 'సాక్షి' నెట్‌వర్క్

సనాతన ధర్మం కోసం సహకరిస్తాం..

మన్ననూర్: దేశంలో హిందూ సనాతన ధర్మాన్ని కాపాడటం కోసం ఎల్లవేళల తమ వంతు సహకారం ఉంటుందని కేంద్ర గోరక్ష హెల్ప్ లైన్ కమిటీ సభ్యుడు శ్రీవాసుబాబు, విశ్వహిందూ పరిషత్ సమరసత ప్రముఖ్ దామోదర శెట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. వారు శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మన్ననూర్‌లోని ఓం చౌరస్తా వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వారిని మంగళవారం ఘనంగా సన్మానించారు. దామోదర్, వెంకటరమణ, శేఖర్, నర్సింహ, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సన్మానిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



వెల్దండలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



అంతారంలో బడిఈడు చిన్నారులను గుర్తించిన ఉపాధ్యాయులు

వెల్దండ: బడిఈడు పిల్లలను పనులకు పంపించకుండా పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు మంగళవారం ఇంటింట తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు కుందారంతండా, కొట్ర, గొల్లోనిపల్లి, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్న, శ్రీనాథ్, సంగీత, పర్వతాలు, నాజియా, రవి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

తాడూరు: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాఠశాలలో పిల్లల నమోదు కోసం ఉపాధ్యాయులు ఇంటి బాట పట్టారు. మంగళవారం మండలంలోని అంతారం పాఠశాల హెచ్‌ఎం శేషగిరి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులంతా బడిఈడు కలిగిన పిల్లల జాబితా ఆధారంగా ఇంటింటా తిరిగి చదువుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా అర్చనలు, పంచామృతం, అభిషేకం, సింధూరలేపనం, ఆకుపూజ వంటి కార్యక్రమాలను ఆలయంలో నిర్వహించారు. అనంతరం పలు గ్రామాల నుంచి పాల్గొన్న భక్తులకు అన్నదాన కార్యక్రమం పెద్దఎత్తున నిర్వహించినట్లు అర్చకులు లోకేశ్వర్‌రావు తెలియజేశారు.

నేటి నుంచి నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన

పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడలో నూతన ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయ విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఇందిర రవినాయక్ తెలియజేశారు. కార్యక్రమానికి కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలియజేశారు.

ఘనంగా ముగిసిన బొడ్రాయి ఉత్సవాలు

లింగాల: మండల పరిధిలోని దారారంలో సర్పంచ్ లావుడ్యా కవిత ఆధ్వర్యంలో ఆరు రోజులుగా కొనసాగిన గ్రామదేవత బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు మంగళవారం బోనాల ఊరేగింపుతో ముగిశాయి. శక్తి పూజారి బైండ్ల గిరి శక్తి పూజలతో బొడ్రాయిని పునఃప్రతిష్ఠించడంతో పాటు పోచమ్మ, మైసమ్మ గ్రామదేవతల ప్రతిష్ఠలను నిర్వహించారు. బోనం కుండలతో ఊరేగింపులు జరిపి గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. బొడ్రాయి వేడుకల సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం అలుముకుంది. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారందరూ గ్రామానికి చేరుకుని గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.



దారారంలో బోనాలతో ఊరేగుతున్న మహిళలు

విద్యార్థుల చదువుకు అండగా ఉంటా..



మహిళతో ముచ్చటిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆకాంక్ష ఉండి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల చదువులకు అండగా నిలుస్తానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముకురాలలో పర్యటించారు. ఐక్యతా ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమైన విద్య, వైద్యం, ఉపాధి అనే విషయాలను గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను, ఇటీవల మృతిచెందిన కుటుంబాలను పరామర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఆయన వెంట ప్రతాప్‌రెడ్డి, సతీష్, మల్లేష్, భరత్, లక్ష్మారెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

బాధితులకు నష్టపరిహారం



మన్ననూర్: పాడి ఆవును పెద్దపులి చంపిన సంఘటనలో బాధితులకు అటవీశాఖ తరఫున ఆర్థిక సాయం అందజేశామని ఎఫ్‌ఆర్‌ఓలు ఈశ్వర్, ఆదిత్య తెలిపారు. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లికి చెందిన దేవులా నాయక్‌కు సంబంధించిన ఆవుపై ఆదివారం పెద్దపులి దాడి చేసి చంపేసింది. మంగళవారం మన్ననూర్ ఎఫ్‌డీఓ కార్యాలయం ఆవరణలో నష్టపోయిన వారికి పరిహారంగా రూ.10 వేలు అందజేశామని చెప్పారు.

రెజ్లర్లపై లైంగికదాడి బాధాకరం

కల్వకుర్తి రూరల్: ఢిల్లీలో మహిళా రెజ్లర్లపై ఎంపీ బ్రిజ్ భూషన్ చరణ్‌సింగ్ లైంగిక దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ గణేష్ అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. సామాన్య మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. లైంగిక దాడికి పాల్పడిన బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని గణేష్ డిమాండ్ చేశారు. ఆయన వెంట యాదయ్య, శివ, విష్ణు, మహేష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్‌కు గాయాలు

లింగాల: లింగాల నుంచి దారారం వెళ్లే మార్గంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాలపేట మండలం ఏదులకు చెందిన గున్నమోని రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బాధిత వ్యక్తి దారారంలో జరిగిన బొడ్రాయి పండుగకు ద్విచక్రవాహనంపై వచ్చి, తిరుగు ప్రయాణంలో ప్రమాదం చోటుచేసుకుంది. కోళ్ల దాణాతో లింగాల నుంచి దారారం వైపు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వెనుక భాగంలో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని వెంటనే అదే డీసీఎంలో మండల కేంద్రంలో సీహెచ్‌సీకి తరలించారు. బాధిత వ్యక్తి హైదరాబాద్‌లోని ఓ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పారు.

గడ్డివాము దగ్ధం

బల్మూర్: మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గోరటి రాములుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాములు వ్యవసాయ పొలంలో ఉంచిన గడ్డివాము మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక రైతులు రాములుకు సమాచారం ఇచ్చారు. బిందెలతో మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేయగా.. అప్పటికే పూర్తిగా దగ్ధమైంది. రూ.30 వేల నష్టం వాటిల్లిందని, ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



బీజేపీ నాయకుల నిరసన



పెద్దకొత్తపల్లి బస్టాండ్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దకొత్తపల్లి: సీఎం ఎన్నికల సమయంలో ఇచ్చిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ చేపట్టనందుకే నిరసన చేపట్టామని బీజేపీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఏ మొహం పెట్టుకుని సీఎం పర్యటనకు వస్తున్నారని లింగస్వామి అన్నారు. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న సీఎంకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హెడ్‌కానిస్టేబుల్ కురుమయ్య తన సిబ్బందితో వచ్చి బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నాగరాజు, బాబురావు, శివ, రాజు, లింగస్వామి పాల్గొన్నారు.

నాయకుల అరెస్ట్

కోడేరు: బీజేపీ మండల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పుల్లయ్య, చంద్రయ్య, ఓర్సు రామకృష్ణ, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విపక్ష పార్టీల నాయకులు..

కొల్లాపూర్: సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో విపక్ష పార్టీల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావును హౌజ్ అరెస్టు చేశారు. ఆపార్టీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులను కూడా ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్, సత్యనారాయణగౌడ్, సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కాంతారావు తదితరులున్నారు.

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు..

పెంట్లవెల్లి: బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలె భరత్‌ను మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పెంట్లవెల్లి పోలీసులు అరెస్ట్ చేశారని, ఇది సరికాదని, ఈ అరెస్టులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేతకాని తనానికి నిదర్శనం త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలె భరత్‌చంద్ర అన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



పెద్దకొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు



వెల్దండలో కాంగ్రెస్ నాయకుల అరెస్టు

వెల్దండ: జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అడ్డంకులు, నిరసనలు లేకుండా పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వెల్దండ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులను మంగళవారం తెల్లవారు జామున ముందస్తు అరెస్టు చేశారు. నిరంకుశ పాలన సాగిస్తున్న కేసీఆర్‌కు తగిన గుణం చెప్పడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి అరెస్టయిన వారిలో ఉన్నారు

తెలకపల్లి: మండల కేంద్రంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు రెడ్డపాకుల శివశంకర్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

పెద్దకొత్తపల్లి: కాంగ్రెస్ నాయకులు బాలపీర్, సయ్యద్, శేఖర్‌లను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ప్రతిపక్ష పార్టీల వారిని ముందస్తు అరెస్ట్ చేయడం ఏమిటని ప్రశ్నించారు.

చారకొండ: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, మహేష్, శంకర్ తదితర నాయకులను అరెస్టు చేసి సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

ప్రజాస్వామ్యంలో అక్రమ అరెస్టులు ఏమిటీ.?

మన్ననూర్: అక్రమ అరెస్టులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే చెల్లిందని డీసీసీ కార్యదర్శి కోరె రేణయ్య అన్నారు. మంగళవారం జిల్లాలో సీఎం పర్యటనను అడ్డుకుంటారనే భయంతో కాంగ్రెస్ పార్టీ నాయకులను అరెస్టు చేయడం అవివేకమన్నారు. సీఎం జిల్లాలో పర్యటిస్తే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయట తిరగకూడదంటే బీఆర్‌ఎస్ అవినీతి పాలన ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుందని అన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన కొనసాగించడం కేసీఆర్ ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు.

నిర్మించారు వదిలేశారు

- ఇదీ ధోబీఘాట్ల దుస్థితి
- రజకులకు తప్పని తిప్పలు

లింగాల: కుల వృత్తుల వారికి ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకోవడంలో సకాలంలో ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఐదేళ్ల కిందట మండల కేంద్రంలో దాదాపుగా రూ.4.80 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ధోబీఘాట్లను వాడుకలో తీసుకరావడానికి అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో కులవృత్తిని నమ్ముకుని జీవించే రజకులు పడరాని పాట్లు పడుతున్నారు. వంశపార్యంపరంగా వస్తున్న వృత్తిని కొనసాగించేందుకు రజకులు ఇబ్బందులు పడుతున్నారు. నిర్మించిన ధోబీఘాట్లు శిథిలావస్థకు చేరి కూలుతున్నాయి.

ఐదేళ్లుగా.. నిరుపయోగం

మండల కేంద్రంలో రజకులు దుస్తులు ఉతకడానికి బీసీ కార్పొరేషన్ నుంచి మంజూరైన నిధులను రూ.లక్షలు ఖర్చు చేసి ఆధునిక సౌకర్యాలతో ధోబీఘాట్లను నిర్మించారు. ఒకే సారి 12 మంది రజకులు దుస్తులు ఉతికేందుకు అనువుగా ఘాట్లను నిర్మించారు. ఇక్కడ నీటి వసతికి బోర్ వేయించడమే గాక, ఉతికిన దుస్తులను భద్రపర్చుకోవడానికి ఒక గది నిర్మించారు. నీటి సరఫరాకు ట్యాంక్‌ను నిర్మించారు. విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేశారు. నిర్మాణాలు పూర్తయిన తర్వాత వాడకపోవడంతో విద్యుత్తు వైర్లు, ఇతర వాటిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. గతంలో అప్పాయిపల్లి వెళ్లే మార్గంలో ధోబీఘాట్లు ఉండగా ఆ ప్రదేశం శ్మశానవాటికగా మారడంతో అక్కడ దుస్తులను ఉతికేందుకు రజకులు వెళ్లకపోవడంతో అక్కడ ఉన్న ఘాట్లను తొలగించారు. ఇక్కడ రజకుల సౌకర్యార్థం వేసిన బోర్‌ను నర్సరీకి ఉపయోగించుకుంటున్నారు.



లింగాలలో నూతనంగా నిర్మించిన ధోబీఘాట్లు

అనువు గాని చోట నిర్మాణం

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో అనువుగాని ప్రదేశంలో ధోబీఘాట్లను నిర్మించడంతో రజకులు వాటిని వాడుకోవడానికి అంతగా ఇష్ట పడడం లేదు. ధోబీఘాట్ల చుట్టూ చెట్లు, ముళ్లపొదలు ఉండడంతో ఒక వ్యక్తి వెళ్లి దుస్తులు ఉతికేందుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వాటిని వాడుకునేందుకు వీలుగా విద్యుత్తు సౌకర్యం, రోడ్డు మార్గం ఏర్పాటు చేస్తే బాగుటుందని రజకులు అభిప్రాయపడుతున్నారు.



నిరుపయోగంగా నీటి ట్యాంక్, మోటార్ పంపు